క్లుప్తంగా

నేడు డయల్ యువర్ కమిషనర్

తిరుపతి తుడా : తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు అధికారులు తెలిపారు. ప్రజలు 0877–2227208కి కాల్ చేసి తమ సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లవచ్చని పేర్కొన్నారు. అలాగే ఉదయం 11 నుంచి 12 గంటల వరకు స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు. ప్రజలు నుంచి నేరుగా అధికారులకు అర్జీలు అందజేయవచ్చని పేర్కొన్నారు.

రైల్వేస్టేషన్‌లో భద్రతకు సెగ్వేలు



ప్రయాణికులను పరిశీలిస్తున్న సెగ్వే పోలీస్

తిరుపతి అర్బన్ : తిరుపతి నగరంలోని రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల భద్రత కోసం అధికారులు పలు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా రైల్వే పోలీసులకు అనుకూలంగా రెండు చక్రాలతో ఉన్న సెగ్వే యంత్రాలను సమకూర్చారు. వాటి ద్వారా రైల్వే పోలీసులు రైలు ఇంజిన్ నుంచి చివరి బోగీ వరకు ప్లాట్‌ఫాంపై సంచరిస్తూ ప్రయాణికులకు రక్షణ కల్పిస్తున్నారు.

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం



భిన్నంగా ఆలోచించు పుస్తకంతో గ్రామస్తులు

రామచంద్రాపురం: సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని జన్మస్థల శివాలయం అభివృద్ధి కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని అనుప్పల్లి పంచాయతీ రేకలచేను గ్రామంలో ఆదివారం పిరమిడ్ ధ్యానంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో 41 రోజుల పాటు ప్రతిరోజూ రాత్రి 7.30 నుంచి 8.30 వరకు ధ్యాన ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. ధ్యాన సాధన ద్వారా బీపీ, షుగరు, చర్మ వ్యాధులు, డిప్రెషన్, వెన్నునొప్పి తదితరాలు తగ్గుతాయని వివరించారు. అనంతరం భిన్నంగా ఆలోచించు అనే పుస్తకాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జన్మస్థల శివాలయ వైస్ చైర్మన్ తిమ్మారెడ్డి, బోర్డు మెంబర్లు ఈశ్వర్‌రెడ్డి, రాజారెడ్డి, మాధవ రెడ్డి, దేవరాజులరెడ్డి, హరిబాబు, రాజశేఖర్‌రెడ్డి, ఎర్రమ రెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రెడ్డెప్ప

తిరుపతి తుడా: స్థానిక గ్రీన్ పార్క్ అపార్ట్‌మెంట్ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సామాజిక వైద్య శాస్త్ర నిపుణుడు డాక్టర్ రెడ్డెప్ప ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో బీపీ, షుగర్ వంటి ప్రాథమిక పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డివారి ప్రభాకర్ రెడ్డి, పోలీస్ సంఘం నాయకులు శంకర్ రెడ్డి క్యాంపు కోఆర్డినేటర్ మూర్తి పాల్గొన్నారు.

తీగలపై పక్షి గూళ్లు



పక్షులు గూడు కట్టడంలో వాటికవే సాటి. చెట్ల కొమ్మలకు వేలాడుతూ ఉండేలా, పాములు, తొండలు లోపలికి ప్రవేశించే వీలు లేకుండా నిర్మాణం చేస్తాయి. ఎంత వర్షం కురిసినా లోపల తడవకుండా ఉంటాయి ఆ గూళ్లు. వాటి నేర్పరితనాన్ని, అద్భుతమైన నిర్మాణ కౌశలాన్ని ప్రశంసిస్తూ ప్రముఖ కవి గుర్రం జాషువా 'తేలిక గడ్డిపోచలను దెచ్చి, రచించెదవీవు తూగుటుయ్యేల గృహంబు.. నంతిపురంబులో ప్పగా మేలు భళీ! పులుంగుటికిమీడవురా గిజిగాడ! నీదజా!' అని కొనియాడారు. తిరుపతి నగర శివారులోని అప్పలాయిగుంటకు వెళ్లే మార్గంలో విద్యుత్ తీగలపై కొన్ని పిచ్చుకలు గూళ్లు కట్టాయి. అవి చూపరులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

– సాక్షి ఫోటోగ్రాఫర్ తిరుపతి

భక్తులకు శరణాగతి నేర్పిన అన్నమయ్య



మాట్లాడుతున్న కట్టమంచి మహాలక్ష్మి

తిరుపతి కల్చరల్: భగవంతుని తత్వాన్ని తెలుసుకునేందుకు శరణాగతి తప్ప మరో మార్గం లేదని భక్తులకు అన్నమయ్య తెలియజేశారని ఎస్వీయూ విశ్రాంత ఆచార్యులు కట్టమంచి మహాలక్ష్మి తెలిపారు. అన్నమయ్య 520వ వర్ధంతి ఉత్సవాల్లో భాగంగా అన్నమాచార్య కళామందిరంలో ఆదివారం సాహితీ సదస్సులు నిర్వహించారు. ఆమె అన్నమయ్య సంకీర్తనలు– నైతికతత్వం అనే అంశంపై ఉపన్యసించారు. అన్నమయ్య సంకీర్తనల్లో అహింస, సచ్ఛీలత, భక్తి, శరణాగతి, నామసంకీర్తనం ప్రధానంగా ఉన్నాయన్నారు. తుడా కార్యదర్శి లక్ష్మీ అన్నమయ్య సంకీర్తనలు– నేటి యువత అనే అంశంపై ప్రసంగించారు. అన్నమయ్య వాడుక భాషలోని సామెతలు, పలుకుబడులను ఉపయోగించి 32 వేల సంకీర్తనలను రచించారని, చదువురాని వారికి సైతం అర్థమయ్యేలా చేశారని పేర్కొన్నారు. జాతీయ సంస్కృత విద్యాపీఠం ఆచార్యులు చక్రవర్తి రంగనాథన్ అన్నమయ్య సంకీర్తనలు– ఆళ్వార్లు అనే అంశంపై ఉపన్యసించారు. అన్నమయ్య ఆళ్వార్ల దివ్యప్రబంధాలను, విశిష్టాద్వైత సిద్ధాంతాన్ని ఉపదేశించి నవ విధ భక్తి మార్గాలతో శ్రీవారిని సేవించారని తెలిపా రు. అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకుడు విభీషణ శర్మ, టీటీడీ ఆస్థాన విద్వాంసుడు గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్, శతావధాని ఆముదాల మురళి పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

అన్నమాచార్య ప్రాజెక్టు, హిందూ ధార్మిక ప్రాజెక్టుల సంయుక్తంగా అన్నమాచార్య కళామందిరం, మహతి కళాక్షేత్రంలో ప్రదర్శించిన సంగీత, నృత్య సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. అన్నమాచార్య కళామందిరంలో ఆదివారం సాయంత్రం విశాఖపట్టణానికి చెందిన చైతన్య బ్రదర్స్ బృందం ప్రదర్శించిన భక్తి సంకీర్తనల గానం ఆకట్టుకుంది. మహతి కళాక్షేత్రంలో ఎస్వీ సంగీత, నృత్య కళాశాల అధ్యాపకులు వందన బృందం ఆలపించిన సంకీర్తనలు అలరించాయి. సంగీత కళాశాల ప్రిన్సిపాల్ ఉమా ముద్దుబాల బృందం ప్రదర్శించిన భారతనాట్య నృత్యం కనువిందు చేసింది.

శ్రీవారికి పరదాలు



ప్రత్యేక పరదాలకు తుది మెరుగులు దిద్దుతున్న పరదాల మణి

తిరుపతి కల్చరల్: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని తిరుపతికి చెందిన మణి తిరుమల శ్రీవారి ఆలయానికి సమర్పించేందుకు ప్రత్యేక పరదాలు, కురాళాలు రూపొందించారు. ప్రతి ఏటా ఉగాది, సాలకట్ల బ్రహ్మోత్సవాలు, ఆణివార ఆస్థానం, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు ఆలయ శుద్ధి అనంతరం పరదాల మణి ప్రత్యేక పరదాలు, కురాళాలు బహూకరిస్తున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 22వ తేదీన ఉగాది పర్వదినం సృష్టి ప్రారంభం, యుగాది, కలియుగ వైకుంఠుడైన శ్రీవేంకటేశ్వర స్వామి భూమిపై పాదం మోపిన రోజు కావడంతో స్వామివారి పాదాలకు పూర్ణకుంభంతో స్వాగతం పలకడంతోపాటు స్వామి వారి పాదాలు, శంఖు, చక్రం, తిరునామం, ఉగాది సంప్రదాయం ఉట్టిపడేలా అరటి, మామిడి తోరణం వంటి వాటితో మూడు పరదాలు, రెండు కురాళాలు రూపొందించారు. వీటిని ఆయన సోమవారం తిరుమల శ్రీవారి ఆలయంలో అధికారులకు సమర్పించనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీవారికి పరదాలు అందించే సేవ దక్కడం తన పూర్వ జన్మసుకృతమన్నారు. తన జీవితాంతం శ్రీవారి సేవలో తరిస్తానని పేర్కొన్నారు.

అఖిల గాండ్ల సంఘం జిల్లా నూతన కమిటీ ఎంపిక



నూతన కమిటీని ప్రకటిస్తున్న సుబ్బారావు

తిరుపతి కల్చరల్: అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం తిరుపతి జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం కార్యాలయంలో ఆదివారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.సుబ్బారావు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా నెల్లూరుపల్లి నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా బండారు శ్రీనివాసులు, కోశాధికారిగా ఒరిగొండ గిరిధర్‌ను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నెల్లూరుపల్లి నాగరాజు, బండారు శ్రీనివాసులు మాట్లాడుతూ తమ కుల వృత్తికి పునః వైభవం తీసుకురావడానికి కృషి చేస్తామన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు, పథకాలపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నరవ అనంతం, గిద్దలూరు ప్రభాకర్, హరగోపాల్, వెంకట్‌రావు, భవాని ప్రియ, నాగరాజు పాల్గొన్నారు.

ఘనంగా వాసవీ క్లబ్ కమిటీ ప్రమాణ స్వీకారం



కార్యవర్గాన్ని అభినందిస్తున్న ముర్రం శెట్టి రాములు

తిరుపతి కల్చరల్: కొత్తవీధిలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం వాసవీ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం ఘనంగా నిర్వహించారు. ఇందులో టీటీడీ బోర్డు సభ్యుడు ముర్రం శెట్టి రాములు ముఖ్య అతిథిగా పాల్గొని కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. అంతకుముందు గోపూజ చేశారు. వాసవీ క్లబ్ అధ్యక్షుడిగా టి.రమేష్‌బాబు, కార్యదర్శిగా ఎస్.శ్రీరాములు, కోశాధికారిగా కేఎస్.సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా శశిధర్, నరసింహకుమార్, సహాయ కార్యదర్శులుగా మురళి, పామిడి రామ్మూర్తి, వీకేఎస్‌పీ చైర్మన్ నామా రాజేష్, జోన్ చైర్మన్‌గా ఎం.తేజ ప్రమాణం చేశారు. ఆర్యవైశ్య సంఘం నేతలు జక్కా సుబ్బరాజు, పసుపర్తి గోపీనాథ్, దిండుకుర్తి నరసింహులు, సత్యనారాయణ, శిరీష పాల్గొన్నారు.

ఆశా వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



మాట్లాడుతున్న రాయపనేని హరిక్రిష్ణ

తిరుపతి కల్చరల్: ఆశా వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాయపనేని హరిక్రిష్ణ డిమాండ్ చేశారు. ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో ఆదివారం తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల ముఖ్య ఆశా వర్కర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆశా వర్కర్లను నిర్బంధ కార్మికులుగా మార్చి వారికి సంబంధం లేని పనులు చేయిస్తున్నారని ఆరోపించారు. డీఎంహెచ్‌వో గత ఏడాది ఆశా వర్కర్ల విధులపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినా కొందరు మెడికల్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు, నోడల్ ఆఫీసర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఆశా వర్కర్స్ ఫెడరేషన్ ఉమ్మడి చిత్తూరు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జె.గంగాదేవి మాట్లాడుతూ ఆశా వర్కర్లకు వైఎస్ఆర్ ఆసరా, వికలాంగ, వితంతు పెన్షన్లను కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్లకు ఆరు నెలలు ప్రసూతి సెలవులు ఇవ్వాలని, 45 ఏళ్లు పైబడిన వారికి మెడికల్ లీవులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో విమల, రమణి, లత, కిరణ్‌కుమారి, సుభాషిణి, జ్యోతి, హిమబిందు, శ్రీదేవి, రజియ, పద్మావతి పాల్గొన్నారు.

సినీ నటుడు మోహన్‌బాబుకు పలువురి శుభాకాంక్షలు



మోహన్‌బాబుకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్



మంచు యువసేన రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ చక్రవర్తితో కలిసి కేక్ చేస్తున్న మోహన్‌బాబు

చంద్రగిరి: సినీ నటుడు, మాజీ ఎంపీ, ఎంబీయూ చాన్సలర్ మంచు మోహన్‌బాబుకు పలువురు ప్రముఖులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఆదివారం మోహన్‌బాబు యూనివర్సిటీలో జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అక్కడికి చేరుకుని పుష్పగుచ్ఛం అందజేసి మోహన్‌బాబుకు శుభాకాంక్షలు తెలిపారు. తిరుమల శ్రీవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఇటీవల వివాహం చేసుకున్న మంచు మనోజ్, మౌనిక దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రో చాన్సలర్ మంచు విష్ణును కలిసి ఆప్యాయంగా పలుకరించారు. అలాగే వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున వచ్చిన మోహన్‌బాబు అభిమానులు పూలమాలలు, శాలువలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. యూనవర్సిటీలోని ఎంఎస్ఎస్ బ్లాక్‌లో ఏర్పాటు చేసిన బ్లడ్ బ్యాంకును సినీ నటి మంచు లక్ష్మీప్రసన్న ప్రారంభించారు. 100 మంది సిబ్బంది, 200 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. మంచు యువసేన రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ చక్రవర్తి ఆధ్వర్యంలో మోహన్‌బాబు భారీ కేక్ కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు.

వేడుకలు రద్దు

మోహన్‌బాబు యూనివర్సిటీలో ఆదివారం నిర్వహించాల్సిన వార్షికోత్సవాన్ని వర్షం కారణంగా రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు. సోమవారం సాయంత్రం వేడుకలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బ్రహ్మోత్సవాలు విజయవంతం చేయండి



మాట్లాడుతున్న జేఈవో వీరబ్రహ్మం

తిరుపతి అలిపిరి: శ్రీవారి సేవకులు ఎప్పటిలాగే బాగా పనిచేసి ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలు, కల్యాణోత్సవాన్ని విజయవంతం చేయాలని టీటీడీ జేఈవో వీరబ్రహ్మం పిలుపునిచ్చారు. ఆయన ఆదివారం ఒంటిమిట్టలో శ్రీవారి సేవకులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 5వ తేదీ స్వామివారి కల్యాణోత్సవానికి సాయంత్రం 4 గంటల నుంచే భక్తులు గ్యాలరీల్లోకి వస్తారని తెలిపారు. భక్తులకు అన్నప్రసాదం, లడ్డూ ప్రసాదం, అక్షింతలు, పసుపుకుంకుమ, వాటర్ పాకెట్లు ఉంచిన బ్యాగు అందజేస్తామని చెప్పారు. వాటిని శ్రీవారి సేవకులు గ్యాలరీల్లోని భక్తులకు పంపిణీ చేయాలని సూచించారు. సేవకోసం వచ్చే వారికి సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. టీటీడీలో శ్రీవారి సేవ విభాగానికి ఎంతో గౌరవం గుర్తింపు ఉన్నాయన్నారు. ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాల్లో అద్భుత సేవలందించి ఈ పేరు నిలుపుకోవాలని కోరారు. ఎస్వీబీసీ సీఈవో షణ్ముఖ్ కుమార్, టీటీడీ చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, పీఆర్వో రవి, ట్రాన్స్‌పోర్ట్ జీఎం శేషారెడ్డి, శ్వేత డైరెక్టర్ ప్రశాంతి, వీజీవో మనోహర్ పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు



కారును ఢీకొనడంతో ధ్వంసమైన బైక్

చంద్రగిరి: మండలంలో ఆదివారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. పాకాలకు చెందిన ఉదయ్ కిరణ్ ఎంబీయూలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఆదివారం తిరుపతి నుంచి ద్విచక్ర వాహనంపై కళాశాలకు బయలుదేరాడు. వెంకట పద్మావతి కళాశాల సమీపంలో ఆర్టీసీ బస్సు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతన్ని 108 సిబ్బంది తిరుపతి రుయాకు తరలించారు. కుటుంబ సభ్యులు ఉదయ్ కిరణ్‌ను వేలూరు సీఎంసీకి తీసుకెళ్లారు. బస్సును పోలీసు స్టేషన్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కారును ఢీకొన్న ద్విచక్ర వాహనం

ఏ.రంగంపేట సమీపంలోని అటవీశాఖ చెక్‌పోస్టు వద్ద ఆపి ఉన్న కారును ద్విచక్ర వాహనం ఢీకొనడంతో వ్యక్తి గాయపడ్డాడు. చిన్నగొట్టిగల్లు మండలం దీన్‌దార్‌పల్లికి చెందిన ఇమ్రాన్ అలీఖాన్ ద్విచక్ర వాహనంలో తిరుపతికి వెళుతున్నాడు. ఏ.రంగంపేట చెక్‌పోస్టు వద్ద రోడ్డు పక్కన ఆగి ఉన్న కారును ఢీకొన్నాడు. ఇమ్రాన్ అలీఖాన్‌కు స్వల్పగాయలయ్యాయి. అతన్ని 108 సిబ్బంది తిరుపతి రుయాకు తరలించారు.







బిడ్డ కనిపించపోతే తల్లి విలవిలలాడుతుంది. అందుకే తల్లి ప్రేమను మించినది ఏదీ లేదు అంటారు. తిరుపతి నగరంలో ఆదివారం పసుపర్తి మార్కెట్ నుంచి అనంత వీధి వరకు వాహనంలో ఆవును, దూడను తరలించారు. ముందు దూడను తీసుకెళుతుండడంతో ఆవు తల్లడిల్లింది. తన బిడ్డను దూరం చేస్తున్నారని భావించి వాహనం నుంచి ఒక్క ఉదుటన కిందకు దుమికింది. అరుస్తూ పరుగులు తీసింది. యజమానులు దూడను తల్లిచెంతకు చేర్చారు. దీంతో ఆవు దూడను నాకుతూ దగ్గరకు తీసుకోవడాన్ని చూసి స్థానికులు చలించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

క్రెడాయ్ నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కమిటీని ప్రకటిస్తున్న ఆర్.వెంకయ్య

తిరుపతి కల్చరల్ : క్రెడాయ్ సంస్థ 2023–25 సంవత్సరాలకు గాను నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. క్రెడాయ్ కార్యాలయంలో ఆదివారం సంస్థ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల అధికారిగా ఆర్.వెంకయ్య వ్యవహరించారు. క్రెడాయ్ చైర్మన్‌గా వి.శ్రీనివాసులు, అధ్యక్షుడిగా ఎం.రాంప్రసాద్, కార్యదర్శిగా ఎ.రాజేష్‌బాబు, ఉపాధ్యక్షుడిగా ఎం.ప్రభాకర్, కోశాధికారిగా పి.నరసింహారెడ్డి, సహాయ కార్యదర్శిగా పి.శ్రీనాథ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. క్రెడాయ్ అధ్యక్షుడు ఎం.రాంప్రసాద్ మాట్లాడుతూ క్రెడాయ్ రానున్న రెండేళ్ల క్యాలెండర్‌ను, కార్యక్రమాల గురించి తెలియజేశారు.

In the Court of the Principal Senior Civil Judge of Tirupati
O.S.No. 119/2023
P.Udaya Lakshimi ...Plaintiff
V/s
V.Gangadhar Gupta ...Defendant
SUMMONS TO DEFENDANT
V.Gangadhar Gupta S/o
V.Venugopal Chetty, D.No.83,
T.K.Street, Tirupati, Tirupati Dist.
Pin: 517501

Please take notice that the Plaintiff filed the above Suit against you. The said Suit is posted for your appearance before the above said Hon'ble Court on **24.03.2023** at 10.30 AM either in person or through your counsel. In the event of your failure to appear the matter will be decided per law.

Hearing Date: 24.03.2023
(By Order of the Court)
M.VIJAYA SEKHAR
Advocate for Plaintiff, Tirupati

గ్రామపంచాయతి కార్యాలయము, దామలచెరువు, పాకాలమండలం

ఆ.క.నెం.05/2023 తేది: 18.03.2023

బహిరంగ వేలము మరియు టెండర్ల స్వీకరణ

పాకాల మండలం, దామలచెరువు గ్రామ పంచాయతి యొక్క క్రింది కనిన ఆదాయ వనరులను ఒక సంవత్సర కాలమునకు (1 ఏప్రిల్ 2023 మొదలు 31 మార్చి 2024 వరకు) లీజుకు ఇచ్చి ప్రతిఫలముగా ఆదాయం ఆర్జించుటకు దామలచెరువు గ్రామ పంచాయతీ కార్యాలయము ఆవరణం నందు **తేది: 23.03.2023వ గురువారం ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00గం.ల వరకు** టెండర్లు స్వీకరించబడును. అదే రోజు మధ్యాహ్నం 3.00 గం.లకు సదరు ఆదాయ వనరులకు బహిరంగ వేలము నిర్వహించబడును. తదుపరి మధ్యాహ్నం 3.30 గం.లకు సదరు టెండరుదారుల సమక్షములో టెండర్లు తెరువబడును. బహిరంగ వేలము నందు లేదా టెండర్ల నందు నిలిచిన హెచ్చు పాటదారునకు సదరు లీజు ఖరారు చేయబడును. సదరు బహిరంగ వేలము నందు లేదా టెండర్ల నందు పాల్గొనదలచిన వారు వేలపు దినమునకు 3 రోజులు ముందుగా క్రింది తెలిపిన మేరకు ధరావతు రుసుముతో దరఖాస్తు చేసుకోవలెను.

వరుస నెం.	వివరములు	ధరావతు మొత్తము
1.	వారపు సంత కూరగాయల మార్కెట్టు	రూ. 50,000 /-
2.	ప్రైవేటు బస్టాండ్ (ఏ.పి.ఎస్.ఆర్.టి.సి. బస్టాండ్ బస్సులు ప్రభుత్వ వాహనములు మరియు ఆంధ్రప్రదేశ్ టూరిజం కార్పొరేషన్ వాహనములు మినహాయించి)	రూ. 50,000 /-
3.	షాపింగ్ కాంప్లెక్స్ 5 గదులు (విడివిడిగా)	రూ. 5,000 /-
4.	పాత దినపత్రికలు	రూ. 100 /-
5.	కొబ్బరిచెట్లు	రూ. 2,500 /-

మరియు పాకాల మండలం దామలచెరువు గ్రామ పంచాయతినకు ఆర్థిక సంవత్సరము 2023-24కు గాను ఒక సంవత్సర కాలమునకు (1 ఏప్రిల్ 2023 మొదలు 31 మార్చి 2024 వరకు) అవసరమైన ఈ క్రింద తెలిపిన పరికరములు సరఫరా చేయుటకు సీల్డ్ టెండర్లను గ్రామ పంచాయతి కార్యాలయములో పంచాయతి కార్యదర్శి వారిచే తేది: 23.03.2023 గురువారం ఉదయం 11.00 గం.ల నుండి మధ్యాహ్నం 1.00 గం.ల వరకు స్వీకరించబడును. మరియు సదరు టెండర్లను అదేరోజు మధ్యాహ్నం 3.30గం.లకు టెండరుదారుల సమక్షంలో తెరువబడును. కనీస మొత్తము కోట్ చేసిన టెండరును ఖాయపరచబడును. టెండర్ షెడ్యూల్ విడివిడిగా రూ.75/-లు చెల్లించి టెండరు తేదికి 3 రోజులు ముందు కార్యాలయము నందు పొందగలరు.

వరుస నెం.	వివరములు	ధరావత్తు మొత్తము
1.	నీటి సరఫరా పరికరములు	రూ. 5,000 /-
2.	ప్రజారోగ్య పరికరములు సరఫరా	రూ. 5,000 /-
3.	వీధి దీపముల పరికరములు (LED విడి భాగాలు మాత్రమే మరియు ఇతరములు)	రూ. 5,000 /-
4.	స్టేషనరీ సరఫరా	రూ. 1,000 /-

గమనిక: బహిరంగ వేలములో మరియు టెండరులో పాల్గొనదలచిన వారు గ్రామ పంచాయతీకి ఎటువంటి బకాయిలు ఉండరాదు. అట్టివారు వేలములోగాని టెండరులో గాని పాల్గొనుటకు అనర్హులు. మరియు వేలములు మరియు టెండర్లు ఏ కారణము తెలుపకనే రద్దు పరచుటకు లేదా వాయిదా వేయుటకు పంచాయతీ కార్యదర్శి వారికి అధికారము కలదు. పూర్తి వివరములకు కార్యాలయ పనివేళలందు పంచాయతి కార్యదర్శి, దామలచెరువు గ్రామ పంచాయతి వారిని సంప్రదించగలరు.

సం/- శ్రీమతి ఎం.సునిత, సర్పంచ్, దామలచెరువు గ్రామపంచాయతి పాకాల మండలం

సం/- శ్రీ టి.ఆర్.ఢిల్లీబాబు పంచాయతి కార్యదర్శి దామలచెరువు గ్రామపంచాయతి, పాకాల మండలం



తిరుమలలో మోస్తరు వర్షం

అల్పపీడన ద్రోణి ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా వర్షం కురుస్తోంది. ఈ క్రమంలో తిరుమలలో ఆదివారం మోస్తరు వర్షం కురిసింది. దీంతో భక్తులు కొంత ఇబ్బంది పడ్డారు. ఎక్కడికక్కడ షెడ్లలో తలదాచుకున్నారు. కొంతమంది భక్తులు వర్షంలోనే తడుస్తూ ముందుకు సాగారు. వ్యాపారులు దుకాణాలను సైతం మూసేశారు.

- తిరుమల

ఆలయం వెలుపల భక్తుల రద్దీ



నిర్మానుష్యంగా ఉన్న అఖిలాండం



వర్షంలో షెడ్ల కింద నిలుచుని ఉన్న భక్తులు



దుకాణాలపై ప్లాస్టిక్ పట్టలు కప్పిన వ్యాపారులు